క్లుప్తంగా

స్వామివారిని దర్శించుకున్న తాతినేని పద్మావతి



మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని కేడీసీసీబీ చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసిన ఆమె నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. సుప్రభాత సేవలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు స్వామివార్లకు అభిషేకం నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

చట్టాలపై అవగాహన

బంటుమిల్లి: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్ అన్నారు. ఆర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సోమశేఖర్ మాట్లాడుతూ పలు చట్టాలను వివరించారు. ర్యాగింగ్ నేరమని, ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని, భవిష్యత్ దెబ్బతింటుందని చెప్పారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఏజీపీ ఈవీఎస్ రాయుడు విద్యా హక్కు చట్టాలను వివరించారు. హెచ్‌ఎం రామచంద్రరావు, న్యాయవాది సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అమృత కలశ యాత్ర

కోడూరు: కోడూరులో శుక్రవారం అమృత కలశయాత్ర ఘనం జరిగింది. 'నా మట్టి–నా దేశం' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కోడూరు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మండలంలోని 13 పంచాయతీల పరిధిలోని మట్టి నమునాలను సేకరించి, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిని ఢిల్లీలోని పార్లమెంట్ భవనానికి పంపనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ప్రధాన సెంటర్‌లో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఎంఈఓ టీవీఎం రామదాసు, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

మచిలీపట్నంటౌన్: స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని కృష్ణా యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ ఎం. శ్రావణి అన్నారు. శ్రీ విజయానంద డిగ్రీ కళాశాలలో శుక్రవారం మేరీ మట్టి–మేరా దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రాజశేఖర్, డైరెక్టర్ ఎన్. సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ బీజేకే రాజు, శ్రీకాంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అవసరం

బంటుమిల్లి: పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చని పలువురు పేర్కొన్నారు. రక్తహీనతపై అవగాహన కార్యక్రమం పెందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తల్లితండ్రులు తమ చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం సుబ్రమణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమం నిర్వహిస్తున్న తన తల్లిదండ్రులు డీఆర్కే దంపతులు ఆదర్శనీయులని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ దాసరి వరుణ్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛ సుందర చల్లపల్లి కార్యక్రమ నిర్వహణకు డాక్టర్ వరుణ్ రూ.లక్ష చెక్కును మన కోసం మనం ట్రస్ట్ సభ్యులు, విశ్రాంత ప్రిన్సిపాల్ నల్లూరి రామారావుకు అందజేశారు.

ఏటీఎం మోడల్‌తో ప్రయోజనాలు

కోసూరువారిపాలెం(మోపిదేవి): ఏటీఎం మోడల్ ద్వారా సాగు చేస్తే రైతులకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని సేంద్రియ వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె. పార్థసారథి అన్నారు. కోసూరువారిపాలెంలో కోసూరు భార్గవి పొలంలో ఏటీఎం పద్ధతిన 20 రకాల విత్తనాలు, ఆకుకూరలు, ఆరు రకాల కూరగాయలు, మూడు రకాల దుంపజాతి, మూడు రకాల తీగజాతి, రెండు రకాల పప్పు జాతి విత్తనాలను వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడారు. ఐసీఆర్‌పీ రాజేష్‌బాబు, మోపిదేవి మండలం యూనిట్ ఇన్‌చార్జి నరసింహారావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బంటుమిల్లి: అర్తమూరు గ్రామ పరిధి ఓఎన్‌జీసీ సైట్‌లోని సామాన్లు దొంగిలించిన పలువురిని బంటుమిల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. బందరు రూరల్ సీఐ ఎండీ హబీబ్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. ఓఎన్‌జీసీ సైట్లో పనిచేసున్న హోంగార్డు పంతగాని నరేష్, గుడివాడకు చెందిన పాత ఇనుప వ్యాపారులు అహ్మద్ బేగ్, సోహైల్ అహ్మద్ బేగ్, మొగల్ నాగుల్ మీరా అనే వ్యక్తులతో కలిసి గ్యాస్ కట్టర్ సహాయంతో గురువారం ఇనుప సామాన్లను కత్తిరించి వాహనంలో తరలించే ప్రయత్నం చేశారు. చోరీ సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి నలుగురిని పట్టుకుని బంటుమిల్లి పోలీసులకు అప్పగించారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ పైడిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ముద్దాయిలను బంటుమిల్లి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

మంత్రి జోగి రమేష్

గూడూరు: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులను మార్చివేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గూడూరు మండల ముక్కొల్లు సచివాలయం పరిధిలోని ముక్కొల్లు, గండ్రం, నాగవరం, షా అబ్దుల్లాపాలెం గ్రామాల్లో శుక్రవారం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు ఎన్నికల సమయంలో మాత్రమే ఓట్లు అడిగేందుకు గడప గడపకు వచ్చేవారన్నారు. రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి జగనన్న ఎన్నికలతో సంబంధం లేకుండా గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి సచివాలయానికి రూ.40 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నారన్నారు. తద్వారా గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, డ్రెయిన్ల నిర్మాణం వంటి మౌలిక వసతులు సమకూరుతున్నాయని వివరించారు. సుదీర్ఘకాలంగా స్థానికులు కోరుతున్న ముక్కొల్లు–గండ్రం రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు.



బ్రోచర్లు అందజేసి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న మంత్రి జోగి రమేష్



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సింహాద్రి

మారుతున్న ఆర్థిక స్థితిగతులు..

విద్యాభివృద్ధికి రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు విరజిమ్ముతున్నాయని మంత్రి చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పరీక్షాపే చర్చ కార్యక్రమంలో ముక్కొల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు సమ్మెట సత్యనారాయణ, అనిశెట్టి సుచిత్ర, జూపూడి యామిని దుర్గలు ప్రశంసాపత్రాలు అందుకోవడంపై మంత్రి వారిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో చదువుల్లో రాణించాలని మంత్రి ఆకాంక్షించారు.

కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, సర్పంచ్‌లు సమ్మెట జయవర్ధన్, గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్బీకే చైర్మన్ సమ్మెట నాని, ఎంపీటీసీ వై. శ్రీనివాసరావు, సమ్మెట వేణు, నాయకులు పర్ణం పెదబాబు, మోటేపల్లి రత్నారావు, గోరిపర్తి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు పెరుగుతున్న ఆదరణ..

మోదుమూడి(అవనిగడ్డ): వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పనితీరుకు ప్రజాదరణ పెరుగుతోందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని మోదుమూడిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఎన్నో సమస్యలను పరిష్కరించామని వివరించారు. సర్పంచ్ బి. బేబి కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నియోజకవర్గంలోని 70 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతోందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల అన్ని ప్రాంతాల్లో ప్రజలు సానుకూల దృక్పథంతో ఉన్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ అన్నివర్గాలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రామకృష్ణ, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో చేరువైన వైద్యం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: రాష్ట్రంలోని ప్రజలంతా ఆరోగ్యంగా క్షేమంగా ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఘంటసాల మండలంలోని యండకుదురు, అవనిగడ్డ 7వ వార్డులో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సింహాద్రి ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలకు వెళ్లి నిపుణులైన వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చే గొప్ప కార్యక్రమం వల్ల పేదలందరికీ మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని వివరించారు. యండకుదురులో 522 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమాల్లో ఘంటసాల ఏఎంసీ చైర్మన్ వేమూరి వెంకట్రావ్, జెడ్పీటీసీ తుమ్మల మురళీకృష్ణ, సర్పంచ్ ముళ్లపూడి పట్టాభి రామారావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీఓ మరియాదేవి, సింహాద్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏటిమొగలో 500 మందికి వైద్య పరీక్షలు..

ఏటిమొగ(నాగాయలంక): మండలంలోని ఏటిమొగ సచివాలయం పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం ఎంపీడీఓ చతుర్వేదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. జేఏఎస్ జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.శ్రీనివాసరావు శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. రోగులు, వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. తహసీల్దార్ జె.విమలకుమారి, సర్పంచ్ నాయుడు ఉమాదేవి, ఎంపీటీసీ విశ్వనాథపల్లి నాగజ్యోతి, ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, క్యాంప్ ఇన్‌చార్జి డాక్టర్ ఫాతిమున్నీసా, సొర్లగొంది, ఎదురుమొండి, నాగాయలంక పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పెనుమల్లి శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

836 మందికి వైద్య సేవలు..

బంటుమిల్లి: బంటుమిల్లి–2 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. 836 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరాన్ని మంత్రి జోగి రమేష్ తనయుడు రాజీవ్ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార శిబిరం ఆకట్టుకుంది. పెడన నియోజకవర్గ ఎన్నికల అధికారి కె. రాజ్యలక్ష్మి, సర్పంచ్ వెంట్రప్రగడ కృష్ణవేణి, ఎంపీటీసీ ఎండీ కమాల్‌బాషా, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తిరుమాని శ్రీనివాసరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు చేరువగా కార్పొరేట్ వైద్యం..

పెడన: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేసిన మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మనమెప్పుడు అండగానే ఉండాలని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. చేవేంద్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పెనుమల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. 456 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వీరిలో ఐదుగురిని వివిధ శస్త్ర చికిత్సల కోసం ఆరోగ్యశ్రీ ద్వారా విజయవాడకు రిఫర్ చేశారు. 122 మందికి కంటి పరీక్షలు చేయగా 60 మందిని కళ్లజోళ్లకు కంటి వెలుగుకు సిఫార్సు చేశారు. పది మందికి సర్జరీ అవసరమని మచిలీపట్నం రిఫర్ చేశారు. వైద్య నిపుణులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఒర్లగొందితిప్పలో..

కృత్తివెన్ను: నిడమర్రు–2 సచివాలయం పరిధిలోని ఒర్లగొందితిప్పలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి తనయుడు జోగి రాజీవ్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ భూపతిరాజు పాల్గొన్నారు.

● నడకుదురు(చల్లపల్లి): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రయోజనకరమని సర్పంచ్ గొరిపర్తి సురేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించి 287 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

సామూహిక ఎలుకల నిర్మూలనతో మంచి ఫలితాలు

పెడన: రైతులు తమ పంట పొలాల్లో తిష్ట వేసిన ఎలుకలను, పందికొక్కులను సామూహికంగా నిర్మూలించినప్పుడే మంచి ఫలితాలు ఉంటాయని ఎంపీపీ రాజులపాటి వాణి అన్నారు. శుక్రవారం పెనుమల్లి రైతు భరోసా కేంద్రంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, సర్పంచు వెంకట రామానాయుడుతో కలిసి ఎలుకల మందు మిశ్రమాన్ని రైతులకు ఉచితంగా అందజేశారు. ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులను రారాజులను చేయాలనే లక్ష్యంతో పాటు వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకునేందుకు ఉచితంగా ఎలుకల మందును ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. దీనిని రైతులంతా కలిసి సామూహికంగా వినియోగించుకున్నప్పుడే ఎలుకలను నిర్మూలించగలుగుతామని తెలిపారు. ఏఓ జీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు. మాజీ ఎంపీపీ అచ్యుతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగబాబు, వ్యవసాయ సలహా సంఘ మండల చైర్మన్ కాగిత వెంకటేశ్వరరావు, దావు భైరవలింగం, బెజవాడ నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ఆధ్వర్యంలో అవగాహన, డెమో..

నాగాయలంక: వక్కపట్లవారిపాలెం, తలగడదీవి, సంగేగడ్డ, రేమాలవారిపాలెం తదితర ఆర్‌బీకే లలో సామూహిక ఎలుకల నిర్మూలనపై అవగాహన, డెమో కార్యక్రమాలు నిర్వహించారు. ఎలుకల నిర్మూలన పద్ధతులు, బ్రోమోడయోలిన్ విషపు ఎర తయారీ విధానాన్ని వ్యవసాయ సిబ్బంది వివరించారు. మండల వ్యవసాయ అధికారి ఎ.సంజీవరావు, జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, సంగేగడ్డ సర్పంచి తోట లంకమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు పుట్టి స్వరూపరాణి, తోట కృష్ణ, వ్యవసాయ సహాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని ఎస్ఎన్ గొల్లపాలెం రైతుభరోసా కేంద్ర పరిధిలోని రైతులకు ఎలుకల నివారణ మందును శుక్రవారం అందజేశారు. మండల వ్యవసాయాధికారి డి. హారిక రైతులకు బ్రోమోడైలైన్ మందులను కలిపి ఎరను తయారు చేసుకునే విధానాన్ని వివరించారు.

డ్వాక్రా గ్రూపు సభ్యులను మోసం చేసిన యానిమేటర్

● ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన
● ఆందోళన చెందుతున్న గ్రూపు సభ్యులు

చిలకలపూడి(మచిలీపట్నం): మండల పరిధిలోని పోలాటితిప్ప గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యులను ఆ గ్రామ యానిమేటర్ మోసం చేసిన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. గ్రామంలోని 56 గ్రూపులకు తమ్ము పద్మ యానిమేటర్‌గా వ్యవహరిస్తోంది. ఈ 56 గ్రూపుల్లో సుమారు 700 మంది సభ్యులు ఉన్నారు. వీరి నుంచి రూ. 5 కోట్ల వరకు దోపిడీ చేసిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందించకపోవడంతో గ్రామంలో తుపాను షెల్టరు వద్ద లెక్కలు తేల్చేందుకు తమ్ము పద్మను గ్రామపెద్దలు విచారణ చేశారు. ఈ విచారణలో ఒక్కొక్క సంఘం నుంచి రూ. 50 వేల నుంచి రూ. 5 లక్షల వరకు దోపిడీ జరిగిందని గ్రామ పెద్దలు గుర్తించారు. గ్రూపు సభ్యుల్లో చదువుకున్న వారిని కాకుండా నిరక్షరాస్యులను గ్రూపు అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపిక చేసి మోసానికి పాల్పడినట్లు సభ్యులు గ్రామ పెద్దలకు తెలిపారు. గ్రూపు సభ్యులు రుణాలు తీసుకోవాలన్నా, తిరిగి కట్టాలన్నా పొదుపు మొత్తాలు తిరిగి చెల్లించాలన్నా పద్మ ద్వారానే కట్టేవారమని, మమ్మల్ని బ్యాంకుకు రానివ్వకుండా 25 సంవత్సరాల నుంచి యానిమేటర్‌గా వ్యవహరిస్తూ మోసానికి పాల్పడిందని సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పెద్దలు బ్యాంకు వద్దకు వెళ్లి తమ ఖాతాలను పరిశీలించగా ఖాతాల మొత్తాల్లో వ్యత్యాసాలు రావడంతో అసలు విషయం బయటపడిందని చెబుతున్నారు. తప్పనిసరిగా బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌ను విచారణ చేస్తే ఎంత మొత్తంలో పద్మ తమను మోసం చేసిందో నిజానిజాలు బయట పడతాయని సభ్యులు తెలిపారు. బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్, యానిమేటర్ పద్మలపై కేసులు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన డ్వాక్రా సభ్యులు కోరుతున్నారు.

కొమ్మారెడ్డి పాఠశాలలో దసరా వేడుకలు

బంటుమిల్లి: దసరా వేడుకలను కొమ్మారెడ్డి ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన మహిషాసుర వధ ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురు విద్యార్థినులు సంప్రదాయ నృత్యాలతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్ దసరా పండుగ ప్రాముఖ్యతను వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయమే దసరా అని వివరించారు.



డ్రెయిన్ పనులు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: 37వ డివిజన్ రాజుపేట రంగాబొమ్మ సెంటర్‌లో రహదారుల వెంబడి పక్కా డ్రెయిన్ల నిర్మాణ పనులను శుక్రవారం చేపట్టారు. గడప గడపకు మన ప్రభుత్వం పథకం ద్వారా మంజూరైన రూ. 20 లక్షల నిధులతో డివిజన్‌లో పక్కా డ్రెయిన్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఇటీవల మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శంకుస్థాపన చేశారు. శుక్రవారం పనులు చేపట్టారు.

న్యాయ సలహా కేంద్రం ప్రారంభం

గూడూరు: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని కృష్ణా జిల్లా మొదటి అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు కోరారు. గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత న్యాయ సలహా కేంద్రాన్ని జిల్లా మొదటి అదనపు జడ్జి చిన్నంశెట్టి రాజు శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. ప్రతి శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సీనియర్ న్యాయవాది, పారా లీగల్ వలంటీర్లు లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో అందుబాటులో ఉండి ప్రజలకు ఉచితంగా న్యాయపరమైన సలహాలు అందిస్తారని వివరించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీ రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి

నడకుదురు(చల్లపల్లి): భాద్రపద మాస శివరాత్రి పర్వదిన వేడుకలు పృథ్వీశ్వర స్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వారికి విశేష పూజలు, అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ జరిగాయి. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

మోపిదేవి: రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మోపిదేవి గురుకుల కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, షటిల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్ తదితర క్రీడాపోటీల్లో తమ కళాశాల విద్యార్థులు సైకం రాము, సైకం లక్ష్మణ్, చొక్కా ఆరాను, టి. భానుప్రసాద్, కె. నాగవంశీ, పాలెపు వెంకట నారాయణ, గరికిపాటి శ్రీ విష్ణు, ఎస్ గోపీచంద్, ఎస్. నరసింహ, పి. ఆనందపాల్, టి. చరణ్‌తేజ్, పి. రామ్‌చరణ్, కె. మహేష్, పి. బాల రాహుల్ తేజ్ ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థులను, కళాశాల పీడీ కేవీ సత్యనారాయణను పలువురు అభినందించారు.

దసరా సెలవులను అమలు చేయాల్సిందే

మచిలీపట్నంటౌన్: దసరా సెలవులను ప్రైవేటు విద్యాసంస్థలు తప్పనిసరిగా అమలు చేయాలని డీవైఈఓ. యూవీ సుబ్బారావు ఒక ప్రకటనలో ఆదేశించారు. ఈ నెల 14 నుంచి 24వ తేదీ వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. సిలబస్ పూర్తి కాలేదనే నెపంతో స్టాఫ్ మీటింగ్, వర్క్‌షాప్, రిజిస్టర్ వర్క్‌షాప్‌ల పేరుతో అదనపు తరగతులు నిర్వహించే ప్రైవేటు విద్యాసంస్థలపై మండల విద్యాశాఖాధికారులతో పాటు ఉన్నతాధికారులకు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కాల్‌సెంటర్ నంబర్ 1902, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ నెంబర్ 90131 33636 కు ఫిర్యాదు చేయవచ్చునని సుబ్బారావు తెలిపారు.

మల్లేశ్వరునికి విశేష పూజలు

టి.కొత్తపాలెం(నాగాయలంక): మాస శివరాత్రి పర్వతిథిని పురస్కరించుకుని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపటి నుంచి ఉత్సవాలు

భావదేవరపల్లిలో కొలువైన కాశీవిశ్వేశ్వరస్వామి సమేత అన్నపూర్ణాదేవి ఆలయంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

రేపటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీ పెదకళ్లేపల్లిలోని దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం స్వామివారు, అమ్మవార్లకు స్నానాభిషేకం అనంతరం 10 గంటల నుంచి దర్శనం కల్పిస్తామన్నారు. 23వ తేదీన విజయ దశమి పర్వదినం రాత్రి 9 గంటలకు స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం, శమీవృక్ష పూజ జరుగుతుందని చెప్పారు. ప్రతి రోజూ ప్రత్యేక పూజలు ఉంటాయని వివరించారు.

గృహ నిర్మాణాలను ప్రారంభించండి



మాట్లాడుతున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: నివేశన స్థలాలు పొందిన లబ్ధిదారులు పక్కా గృహ నిర్మాణాలను ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. 20వ డివిజన్ గిలకలదిండిలో శుక్రవారం నివేశన స్థలాల లబ్ధిదారులు, డ్వాక్రా మహిళల సమావేశం నిర్వహించారు. కిట్టు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణానికి నిధులను విడుదల చేస్తోందన్నారు. బిల్లులు సకాలంలో అందుతున్నందున గృహ నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావాలని చెప్పారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ డ్వాక్రా మహిళల అభివృద్ధికి సీఎం జగనన్న ఎంతగానో తోడ్పాటును అందిస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళలు చేతివృత్తులు, వ్యాపారాల్లో రాణించాలని సూచించారు. చేతివృత్తులు, వ్యాపారాలు చేసే మహిళలను కూడా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటోందని వివరించారు. సమావేశంలో కార్పొరేటర్ తిరుమలశెట్టి వరప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

వెంపటి చినసత్యం జయంతి వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

చిలకలపూడి(మచిలీపట్నం): పద్మభూషణ్ వెంపటి చినసత్యం జయంతి వేడుకలు ఈ నెల 15వ తేదీన కూచిపూడిలో ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆర్. మల్లికార్జునరావుతో కలిసి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వెంపటి చినసత్యం జయంతి వేడుకల్లో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్.కె. రోజా పాల్గొంటారన్నారు. కూచిపూడిలోని సిద్ధేంద్ర యోగి కళాక్షేత్రంలో నిర్వహించే వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చే ప్రజలకు, వాహనాల పార్కింగ్‌కు సరైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఒక అంబులెన్స్‌తో పాటు వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతరంగా విద్యుత్ సరఫరా ఉండేలా పర్యవేక్షించాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్వో పి. వెంకటరమణ, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, డీపీఓ నాగేశ్వరనాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: కోడూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖాధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరుతో పాటు అన్ని గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

16 నుంచి కాకినాడకు ఆర్టీసీ సర్వీస్

అవనిగడ్డ: అవనిగడ్డ డిపో నుంచి కాకినాడకు ఆర్టీసీ సర్వీస్ నడిపేందుకు అనుమతి వచ్చిందని డిపో మేనేజర్ హనుమంతరావు తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 6.05 గంటలకు అవనిగడ్డలో బస్సు బయలు దేరి, మధ్యాహ్నం 1.15కి కాకినాడ చేరుతుందన్నారు. కాకినాడ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు బయలు దేరి రాత్రి 9.40కు అవనిగడ్డ వస్తుందని వివరించారు.

నందీశ్వరునికి అభిషేకాలు

అవనిగడ్డ: స్థానిక రాజశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం నందీశ్వరునికి అభిషేకాలు నిర్వహించారు. త్రయోదశిని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమంలో భక్తులు నందీశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ పి. సీతారామయ్య పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

మోపిదేవి: గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సర్పంచ్ నందిగం మేరీ రాణి అన్నారు. మోపిదేవి నుంచి అయోధ్య వెళ్లే కృష్ణా కరకట్టపై వేస్తున్న చెత్తను శుక్రవారం తొలగించి సున్నం చల్లించారు. గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు, పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

అచ్యుతరామయ్యకు నివాళి

మోపిదేవి: మాజీ సర్పంచ్ కంఠంనేని అచ్యుతరామయ్య వర్ధంతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అచ్యుతరామయ్య సేవలను కొనియాడారు. ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, చిన్నం కోటేశ్వరరావు పాల్గొన్నారు.